ఆన్‌లైన్‌లో వివాహాల రిజిస్ట్రేషన్

- మాన్యువల్ విధానానికి స్వస్తి పలికిన ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లకుండానే దరఖాస్తు చేసుకునేందుకు వీలు
- వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే ఇంటికే వివాహ పత్రాలు



కర్నూలు(సెంట్రల్): వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలో మరింత సులభతరమైంది. గతంలోవివాహ పత్రాలు కావాలంటే నెల రోజుల ముందు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయితే 2023 జనవరి నుంచి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో నూతన దంపతులు వివాహ పత్రాలను సులభంగా పొందవచ్చు. రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లకుండానే ఇంటి నుంచి దరఖాస్తు చేసుకోవడం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం వరకు ప్రక్రియను కొనసాగించవచ్చు.

గతం గతః.. : వివాహాల రిజిస్ట్రేషన్‌లో విధానంలో మాన్యువల్ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. గతంలో వివాహాల రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇది వరకు హిందూ, ప్రత్యేక వివాహాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాన్యువల్ విధానంలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉండేది. పెళ్లికుమారుడుకి 21 ఏళ్లు, పెళ్లికుమార్తెకు 18 ఏళ్లు నిండిన తరువాత వారి ఫొటోలు, ఆధార్ కార్డులు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురు సాక్షులతో దరఖాస్తు పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇచ్చేవారు. సబ్ రిజిస్ట్రార్ వాటిని పరిశీలించి సంతకం చేసిన తర్వాత వివాహ ధ్రువీకరణ పత్రం అందజేసేవారు.

ఆన్‌లైన్‌లో సులభంగా రిజిస్ట్రేషన్

ఆన్‌లైన విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఇంటి వద్ద వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం ఉంది. https//marriage.rs.gov.in//hmr వెబ్‌సైట్‌లో రెండు ఆప్షన్‌లు ఉంటాయి. హిందూ వివాహమైతే దానిపై క్లిక్ చేసి మొబైల్ నంబర్ లేదా ఈమెయిల్‌తో లాగిన్ కావాలి. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి ఆధార్‌కార్డులు, దరఖాస్తుదారుల ఫొటోలు, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి. రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేందుకు స్లాట్‌ను బుక్ చేసుకొని సీఎంఎంఎఫ్ ద్వారా ఫీజు చెల్లించాలి. తరువాత దరఖాస్తు సబ్ రిజిస్ట్రార్‌కు ఇస్తే వారు పరిశీలించి సాక్షులతో సంతకాలు పెట్టించుకొని వెంటనే ధ్రువీకరణ పత్రాం జారీ చేస్తారు. రిజిస్ట్రేషన్ అయ్యాక వివాహ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అవుతుంది. దీని కోసంసబ్ రిజిస్ట్రార్ సాధారణ సంతకం కాకుండా డిజిటల్ సంతకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రత్యేక వివాహాలకు

హిందూ వివాహ పద్ధతిలో జరగని వివాహాలను ప్రత్యేక వివాహాలుగా పరగణిస్తారు. వీటికి సంబంధించి దరఖాస్తు విధానం మరోలా ఉంటుంది. దీనికి నెలరోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. అభ్యంతరాలు తెలుసుకునేందుకు నెల రోజుల పాటు నోటీసు బోర్డులో ఉంచుతారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే యథావిధిగా ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఈఏడాది జనవరి నుంచి ఆన్‌లైన్‌వివాహ రిజిస్ట్రేషన్ విధానం అమల్లోకి వచ్చింది. వివాహ ధ్రువీకరణ పత్రాలు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలి. అందుకోసం అవసరమయ్యే రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. తర్వాత వెబ్‌సైట్ నుంచే వివాహ రిజిస్ట్రేషన్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగలింగేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

క్లుప్తంగా

ఉచిత కరాటే శిక్షణ

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జూన్ 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి సూచించారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సీఆర్ భవన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం అవసరమైన కరాటే శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

టిప్పు సుల్తాన్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్): ఎస్‌డీపీఐ కార్యాలయంలో టిప్పు సుల్తాన్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్ర పటానికి ఆ పార్టీ నగర అధ్యక్షుడు అష్రఫ్ హుస్సేన్, నాయకులు హబీబ్‌ఖాన్, జలీల్, షేక్ షఫీ, షేక్షావలి, షేక్ అబ్దుల్లా గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అష్రఫ్ హుస్సేన్ మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ ఆంగ్లేయుల తుపాకీలకు బెదరకుండా దేశం కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడన్నారు. .

8 నుంచి మొక్కజొన్న కొనుగోలు

కర్నూలు(సెంట్రల్): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు జేసీ నారపురెడ్డి మౌర్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటాల్ రూ.1,962 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఈకేవైసీ, ఈక్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి నాణ్యత ప్రమాణాలు ఉన్న మొక్కజొన్నలను కొనుగోలు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలని సూచించారు.

7న అన్నమాచార్యుల జయంతి

కర్నూలు కల్చరల్: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని ఈనెల 7న సాయంత్రం 4 గంటలకు గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని దత్త కళా క్షేత్రంలో నిర్వహించనున్నట్లు వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు గురువారం తెలిపారు. నాట్య విద్యాధరి దేవీశ్రీ నాట్య ప్రదర్శన, విశాఖ పట్నం కళాకారులచే అన్నమయ్య నాటక ప్రదర్శన, తాళ్లపాక స్వామీజీచే ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మహిళా రెజర్లకు మద్దతు

కర్నూలు సిటీ: బీజేపీ ఎంపీ, రెస్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీలో నిరసన చేపట్టిన మహిళా రెజర్లకు ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు మద్దతు ప్రకటించారు. గురువారం వారు అవుట్‌డోర్ స్టేడియంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి హెచ్.మల్లేష్, నాయకులు శివ ప్రసాద్, శేకప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం వెళ్లే యాత్రికులకు సన్మానం



ప్రయాణికురాలిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని అరుణాచలం ఆలయ సందర్శన కోసం వెళ్లే యాత్రికులను ప్రజా రవాణా శాఖ అధికారులు సన్మానించారు. ఆర్టీసీ కర్నూలు-1డిపో మేనేజరు సుధారాణి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు అరుణాచలం వెళ్లే ఇంద్ర ఏసీ బస్సులో టికెట్టు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులను శాలువా కప్పి అభినందించారు. యాత్రికుల్లో ఉత్సాహం, ప్రయాణికుల్లో ఆసక్తి నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.

కొండారెడ్డినగర్‌లో నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని 38వ వార్డు కొండారెడ్డి నగర్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటలో తెలిపాయి. ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని, పథకాలపై అవగాహన కల్పిస్తారని, నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీకాంప్లెక్స్: రామబాణం,ఉగ్రం,విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్-2, ఏజెంట్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, పొన్నియిన్ సెల్వన్-2, ఉగ్రం, విరుపాక్ష, ఏజెంట్, రామబాణం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: ఉగ్రం, విరుపాక్ష, రామబాణం
ఐనాక్స్ : గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, ఉగ్రం, ది కేరళ స్టోరీ, ఇవిల్‌డెడ్ రైజ్, పొన్నియిన్ సెల్వన్-2
భరత్ కాంప్లెక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్-1, రుద్రుడు
శ్రీరామ : రామబాణం
రాజ్: పొన్నియిన్ సెల్వన్-2
విజయ : రామబాణం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాబా ఫక్రుద్దీన్

కర్నూలు(లీగల్): కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా షేక్ బాబా ఫక్రుద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన షర్మిల గుంటూరు జిల్లా గురజాలకు బదిలీ కాగా ఆమె స్థానంలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో పనిచేస్తున్న షేక్ బాబా ఫక్రుద్దీన్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఆయన ఇన్‌చార్జ్ జడ్జి జ్యోత్స్నదేవి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

పారిశుధ్య పనివేళల్లో మార్పులు

కర్నూలు (టౌన్): ఎండలు ఎక్కువగా ఉన్నందున పారిశుధ్య కార్మికుల (రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, అడిషనల్ వర్కర్స్) పనివేళల్లో మార్పులు చేసినట్లు నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పనియచేయాల్సి ఉంటుందన్నారు. వార్డు శానిటేషన్, ఎన్విరాన్ మెంటల్ కార్యదర్శులు, పారిశుధ్య మేస్త్రీలు, పారిశుధ్య తనిఖీదారులు ఈ వేళల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వార్డు ఆఫీసుల్లో, మస్టర్ తీసుకునే ఆఫీసుల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఎండవేడిమి నుంచి ఉపశమనం కోసం తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్ డివిజన్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

మధుర కవితా సరస్వతి వెంగమాంబ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: మధుర కవితా సరస్వతి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అని ధార్మిక ప్రవచకులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని అన్నారు. గురువారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నృసింహ జయంతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమలలో మొట్టమొదటి అన్నదాత తరిగొండ వెంగమాంబ అన్నారు. అందుకే తిరుమలలో నిత్యాన్నదాన కేంద్రానికి ఆమె పేరుతో నేటికీ అన్నదానం జరుగుతుందన్నారు. అక్షర శారదా సాక్షాత్కారం పొందిన ఏకైక విదుషీమణి వెంగమాంబ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ ముల్లు వెంకట రెడ్డి, లలితా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు మేడా సుబ్రహ్మణ్యం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి అధ్యక్షులు పసుపులేటి నీలిమ, పతంజలి సాయినాథ్ యోగా కేంద్రం అధ్యక్షులు దత్తయ్య, అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి, ధార్మిక ప్రవచకులు సీతామహాలక్ష్మి మాట్లాడారు. కళాకారులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో సభ్యులు జనార్దన్, సాయిలీల, కేశవరావు, ప్రవీణ్, శివజ్యోతి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వివాహిత మృతి

కల్లూరు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత కోలుకోలేక గురువారం మృతిచెందింది. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. చిన్నటేకూరు గ్రామానికి చెందిన శ్వేత(27) భర్త దశరథ కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. దీంతో దశరథను తల్లిదండ్రులతోపాటు భార్య శ్వేత మందలించారు. మనస్తాపనికి గురైన దశరథ బుధవారం పొలానికి వెళ్లి పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న భార్య శ్వేత ఇంట్లోనే పురుగు మందు తాగింది. స్థానికులు ఇద్దరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా గురువారం కోలుకోలేక శ్వేత మృతిచెందగా, దశరథ చికిత్స పొందుతున్నాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కబడ్డీ విజేత ప్యాపిలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జున

ఓర్వకల్లు: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కబడ్డీ పోటీలలో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలోని చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా నిర్వహించిన పోటీలను ఎస్‌ఐ మల్లికార్జున ప్రారంభించారు. ప్యాపిలి జట్టు ప్రథమ స్థానం సాధించి రూ.30 వేలు దక్కించుకుంది. తిమ్మాపురం జట్టు రెండవ స్థానంలో గెలిచి రూ.20 వేలు, శకునాల జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.10 వేలు, పుల్లూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి రూ.5 వేలను దక్కించుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వాసుదేవరెడ్డి, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు



ఎద్దులు బండను లాగుతున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామంలో నిర్వహించిన ఎద్దులు బండలాగుడు పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి తిరునాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. 7 ఎడ్ల జతులు తలపడగా ఎస్ కొత్తూరు బీరం బుల్స్(పెద్ద జత) వృషభాలు మొదటి బహుమతి(రూ.50 వేలు) కైవసం చేసుకున్నాయి. బీరం బుల్స్(చిన్న జత)వృషభాలు రెండవ బహుమతి (రూ.40 వేలు), సోమయాజుల పల్లె యాగాల నర్సయ్య వృషభాలు మూడో బహుమతి(రూ.30 వేలు, అనంతపురం జిల్లా చాగల్లు ఆది నారాయణ వృషభాలు నాల్గవ బహుమతి(రూ.20 వేలు), నంద్యాల జిల్లా ఏ కోడూరు చాగంటి నాగేశ్వరరెడ్డి వృషభాలు ఐదవ బహుమతి(రూ.10 వేలు) దక్కించుకున్నాయి. పోటీలకు వాడాల రామనాయుడు, నందికొట్కూరు అబ్దుల్ కలాం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

ఎస్పీని కలసిన ఎమ్మిగనూరు డీఎస్పీ



ఎస్పీని కలిసిన ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య

కర్నూలు: జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్‌కు నియమితులైన డీఎస్పీ సీతారామయ్య గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల 26న జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో ఐదుగురు డీఎస్పీలు బదిలీ అయిన సంగతి తెలిసిందే. గుంటూరు ఈస్ట్‌లో పనిచేస్తున్న బి.సీతారామయ్యను నూతన సబ్ డివిజన్‌కు నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా బాధ్యతలు చేపట్టిన సీతారామయ్య.. ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



మున్సిపల్ ఉద్యోగులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు (టౌన్): తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మున్సిపల్ ఉద్యోగులకు సూచించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో శ్రీయస్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నగరపాలక ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు వైద్యులు దంత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, శ్రీయస్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యులు సుజాత, సురేష్, ఎంప్లాయీస్ హెల్త్ కోఆర్డినేటర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రికి వినతుల వెల్లువ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు అభివృద్ధి ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఆసుపత్రిలో రోగులకు కనీస వసతులు కల్పించాలని, మందులు, పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించాలని, తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం నాయకులు గౌస్‌దేశాయ్, టి.రాముడు కోరారు.

- డిస్ట్రిక్ట్ రెసిడెన్సి ప్రోగ్రామ్‌లో జూనియర్ వైద్యులకు పనిచేసే చోట వసతులు, సౌకర్యాలు కల్పించాలని, సూపర్‌స్పెషాలిటి పీజీలకు స్టైఫండ్ పెంచాలని ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్ఎస్ తనూజ్, ఉపాధ్యక్షులు తేజేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శులు వాసు, మౌనిక, వైష్ణవి కోరారు.
- ఆసుపత్రిలో 20 ఏళ్లుగా పనిచేసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అక్రమంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయుసి నాయకులు మునెప్ప, మనోహర్ మాణిక్యం తదితరులు కోరారు.
- ఆసుపత్రిలో నక్షత్ర హౌస్‌కీపింగ్ సర్వీసెస్ ఏజెన్సీ ద్వారా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగం కోల్పోయిన వారు విన్నవించారు.
- కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులరైజ్ చేయాలని, టీచింగ్ హాస్పిటల్స్‌లో నర్సులకు పదోన్నతులు కల్పించాలని, హెడ్ నర్సులకు గెజిటెడ్ ర్యాంక్ హోదా కల్పించాలని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులాదేవి కోరారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ చతుర్దశి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో గురువారం నృసింహ చతుర్దశి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగన్నాథ స్వామికి ప్రత్యేక నృసింహ అలంకారం, హరినామ సంకీర్తన జప యజ్ఞం, తులసి హారతి, గౌరా హారతి, తులసి అర్చన, నృసింహ హోమాలు, 56 రకాల ఆహార పదార్థాలచే చప్పన్ భోగ నివేదన చేశారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశమిచ్చారు.

చిన్మయ ప్రభావళి ప్రారంభం

కర్నూలు కల్చరల్: వీఆర్ కాలనీలో చిన్మయ మిషన్ నూతన భవనం చిన్మయ ప్రభావళి గృహ ప్రవేశ పూజ కార్యక్రమం జరిగింది. గురువారం వేద పండితులు గో పూజ, కలశ పూజలతో నూతన భవన ప్రవేశం చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, గురుపాదుకా పూజలు నిర్వహించారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద, కోశాధికారి రత్నప్రసాద్, మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు సిటీ: డీపీఈడీ/బీపీఈడీ/ఎంపీఈడీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నిర్వహించనున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య విశ్వనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రం ఆర్‌యూని ఎంపిక చేశామని, 9వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు రెగ్యులర్ 193 మంది, సప్లిమెంటరీకి 35 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ముగిసిన సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గురువారంతో ముగిసింది. ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఉంటాయి. నైతికత, మానవ విలువ పరీక్ష వచ్చే నెల 2, ఎన్విరాన్‌మెంటల్ విద్య పరీక్ష 3న ఉంటుంది.

7న ఎస్సీ సంక్షేమ సంఘం ఎన్నికలు

కర్నూలు(అర్బన్): విజయవాడలోని అరండల్‌పేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో ఈ నెల 7న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరగనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులుగా రిటైర్డు ఐఏఎస్ అధికారి జేబీ రాజుతో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డు అడిషనల్ ఎస్పీ డా.జీ మురళీక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి ఆర్ రాంబాబు తదితరులు హాజరవుతారన్నారు.

డోర్ డెలివరీని సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన కార్గో -కొరియర్ పార్సిల్స్ డోర్ డెలివరీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వాణిజ్య సంస్థలు, మందుల దుకాణాలు, వ్యాపారులు తమ పార్సిల్స్‌ను డోర్ డెలివరీ చేసి, సమయం వృథా కాకుండా చూసుకోవచ్చన్నారు. కర్నూలు నగర శివరులోని 10 కిలో మీటర్లలోపు దూరంలో ఉన్న అడ్రస్‌లకు సేవలు అందుబాటులో ఉన్నాయని, 10 కేజీల్లోపు బరువు ఉన్న పార్సిల్స్ బుక్ చేసుకోవచ్చని సూచించారు.

డ్రోన్ పైలెట్లకు మంచి అవకాశాలు



శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (అర్బన్): విద్యార్థులకు డ్రోన్ పైలెట్ శిక్షణ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. ఉస్మానియా కళాశాల రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (ఆర్‌సీఈడీఎం) ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులకు నిర్వహించిన 45 రోజుల డ్రోన్ పైలెట్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ఈ ప్లేస్‌మెంట్స్ ఇచ్చారు. సెంచూరియన్ యూనివర్సిటీ, గ్రీన్ కో కంపెనీకి 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారని రీజినల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయిదా సబిహా పర్వీన్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కర్నూలు(రాజ్‌విహార్): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.17.55 లక్షల చెక్కులను ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాతబస్తీలోని తన కార్యాలయంలో గురువారం నలుగురు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు వైద్యం కోసం లక్షలు ఖర్చు చేయరాదనే ఉద్దేశంతో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో 1వ వార్డు కార్పొరేటర్ షాషావలి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): తరచూ వర్షాలు పడుతున్నాయని, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సూచించారు. గురువారం ఆయన విద్యుత్ భవన్ నుంచి కిందిస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో విద్యుత్ తీగలపై కొమ్మలు, చెట్లు విరిగి పడే అవకాశాలు ఉన్నాయని, దీంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు ఫోన్ చేసిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కంచాలన్నారు.

పేర్లు మార్చేదెప్పుడో?



దిన్నెదేవరపాడు సచివాలయంలో బోర్డుపై పాత అధికారుల పేర్లు దర్శనమిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయంలో గతంలో పని చేసి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారుల పేర్లే నేటికీ దర్శనమిస్తుండడం గమనార్హం. కార్యాలయ భవనం గోడపై సమాచార హక్కు చట్టం 2005 బోర్డుకు సంబంధించి ప్రస్తుతం సహాయ పౌరసరఫరా అధికారి, అప్పిలేట్ అధికారిగా గతంలో విధులు నిర్వహించిన వారు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ప్రస్తుతం పని చేస్తున్న వారి పేర్లను పెయింట్‌తో రాయకుండా, కేవలం పేపర్ అతికించారు. కాలక్రమేనా పేపర్ కాస్త చిరిగిపోవడంతో పాత అధికారుల పేర్లే బోర్డుపై దర్శమిస్తున్నాయి.

అర్జీలకు తక్షణ పరిష్కారం



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు: మండల ప్రత్యేక అధికారి, సెట్కూరు సీఈఓ రమణ గురువారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో స్పందనతో పాటు కొనసాగుతున్న వివిధ పనుల ప్రాఫార్మను శనివారం నాటికి అందించాలన్నారు. సచివాలయానికి వచ్చే స్పందన అర్జీలను, ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, వివిధ గ్రామల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సుంకేసులకు 370 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 370 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 0.845 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

ఇంజినీరింగ్ సిబ్బందికి మెమోలు

కోడుమూరు: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు, నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్యాలకుర్తి, కల్లపరి, గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందికి గురువారం ఎంపీడీఓ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లోగా సంజాయిషీ తెలపాలని ఎంపీడీఓ వారిని ఆదేశించారు.